ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వండి

హస్తినాపురం: ముందస్తు సమాచారం ఇవ్వకుండానే టీచర్స్ కాలనీ, హస్తినాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని టీప్రొటెక్షన్ కమిటీ కోఆర్డినేటర్ సన్నీహెరాక్లియస్ అన్నారు. శనివారం బీఎస్‌రెడ్డినగర్ సెక్షన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో 11కేవీ లైన్ విద్యుత్ సరఫరా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా దాదాపు మూడు గంటలకు పైగా సరఫరా నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పైప్‌లైన్ విస్తరణతో నీటి సరఫరా సమస్యకు చెక్



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: దుర్గానగర్ కాలనీలో తాగునీటి పైప్ లైన్ విస్తరణతో నీటి సరఫరా సమస్యకు చెక్ పడుతుందని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్యాభారతి, సిబ్బంది శ్రీహరి, చంద్రారెడ్డి, నాయకులు బీరప్ప, వేణుగౌడ్, కాలనీవాసులు తిరుపతిరెడ్డి, మోహన్, హన్మంత్ యాదవ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని బహిర్గతం చేస్తాయని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురం హుడా సాయినగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పేస్ అండ్ సైన్స్ ఎక్స్‌పోకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఆటో మిషన్, రోబోటిక్ టెక్నాలజీతో తయారు చేసిన పరికరాలను పరిశీలించి వాటి పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ చైర్మన్ ఆకాష్, డైరెక్టర్ సాంబశివ, నాయకులు భాస్కర్, శ్రీను, గోవిందాచారి, రవీందర్‌రెడ్డి, జాలేందర్, తిరుమల్, విష్ణు, ప్రేమ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

నాగోలు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు బండ్లగూడ చెందిన శ్రీనివాస్‌యాదవ్(22) నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15న రాత్రి సమయంలో నాగోలు నుంచి బండ్లగూడ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను నాగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతి చెందిన శ్రీనివాస్ బిల్లు చెల్లింపు విషయంతో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆసుపత్రి నిర్వాహకులతో గొడవకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న నాగోలు పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు బజార్‌ల్లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌ల్లో కూరగాయల ధరలు. టమోటా రూ.13, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకరకాయ 38, బీరకాయ 35, కాలిఫ్లవర్ 18, క్యాబేజీ 13, క్యారెట్ 19, దొండ 45, ఆలుగడ్డ 25, ఉల్లిగడ్డ 34, గోకరకాయ 28, దోసకాయ 18, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, చిక్కుడుకాయ 45, చామగడ్డ 40, మునగ 85, చిలుకడ దుంప 65, బీట్‌రూట్ 21, కీర 35, బీన్స్ 45, క్యాప్సికం రూ.35.

ఈరోజు ఉదయం 9 గంటల వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయి.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- శివారు కాలనీల్లో ఇంకా మట్టి రోడ్లే
- ఇబ్బందుల్లో స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని శివారు ప్రాంతాలకు చెందిన పలు కాలనీల్లో ఇంకా మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. కాలనీలో నడవడానికి, వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన కూడా లేకపోవడంపై పలువురు మండిపడుతున్నారు. హయత్‌నగర్, మన్సూరాబాద్, హస్తినాపురం, బీఎస్‌రెడ్డి, నాగోలు తదితర డివిజన్లలో పలు కాలనీలు మట్టి రోడ్లే ఉన్నాయి. శివారు కాలనీలో దూర ప్రాంతాలకు చెందిన వారు ఇళ్లు కట్టుకుని స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాలనీలో నడవడానికి ఇబ్బందికరంగా ఉన్న రోడ్లపైన మట్టిపోయడానికి కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం!

పన్నులు చెల్లించినా.. వసతులు కరువు

శివారు ప్రాంతాల కాలనీవాసులు ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను చెల్లిస్తున్నా వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా హయత్‌నగర్, బీఎస్‌రెడ్డినగర్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలో వందల సంఖ్యలో నూతన కాలనీలు ఏర్పాటు అయినవి. ఇక్కడ ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. వీరికి డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్లపై వాహనాలు నడపడం వల్ల వెన్ను నొప్పి రావడం, పలు వాహనాలు గుంతల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం గుంతలు కూడా పూడ్చకపోవడంతో పలు కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.





పాపిరెడ్డికాలనీలో అధ్వానంగా మారిన రోడ్లు

గుంతలైనా పూడ్చండి..

కొత్తగా ఏర్పాటవుతున్న కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కనీసం గుంతలైనా పూడ్చాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలనీలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని పలు కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్లపై అధికారులు దృష్టిపెట్టాలి..

శివారు కాలనీలో రోడ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ కాలనీల సమస్యలను పట్టించుకోవడం లేదు. కాలనీలో ఎగుడుదిగుడుగా ఉన్న రోడ్లను సమాంతరంగా చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– ప్రసన్నకుమార్, పాపిరెడ్డికాలనీ, బీఎస్‌రెడ్డినగర్ డివిజన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి పొన్నం ప్రభాకర్



సీనియర్ సిటిజన్స్ భవనం పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

దిల్‌సుఖ్‌నగర్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్‌కేపురం డివిజన్‌లో శనివారం పర్యటించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ 26 లక్షలతో ఆర్‌కేపురం కాలనీలో చేపడుతున్న సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాల్ భవనానికి, రూ.15 లక్షలతో హరిపురికాలనీ సీనియర్ సిటిజన్స్ భవనం పనులకు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డితో కలిసి శనివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కృషితో ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ రూ. 10 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఏడాదిలోపు పనులు పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కాగా ఆర్‌కేపురానికి గతంలో ఆర్టీసీ బస్సులు వచ్చేవని ఇప్పుడు రావడం లేదని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన త్వరలోనే బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పున్న నిర్మల గణేశ్ నేత, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, సురేశ్, రమేశ్ నేత, భూపాల్ రెడ్డి, పందుల వెంకటేశ్ గౌడ్, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, పెద్దవూర సైదులు, చిలుకూరి లక్ష్మి, పగడాల శ్రీశైలం, కల్యాణ్ యాదవ్, లింగ స్వామి గౌడ్, షఫీ, మహేందర్, రాజు నాయక్, ఇమ్రాన్, ఎల్లన్న, శ్రీకాంత్, ప్రేమ్ నాయక్, నబీ, శ్రీధర్, చందు, సూరి, మహ్మద్, పటేల్, నగేశ్, సంతోష్, భాస్కర్ నాయక్, అనుదీప్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధిలోని పలు కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న పనులతో పాటు నూతన భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ నర్సింహారెడ్డి హెచ్‌ఎండబ్ల్యూఎస్, సీవరేజీ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని సీఎస్‌ఆర్ కాలనీ నుంచి మొదలైన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ఈ పనులకు సరిపడా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. డివిజన్‌లోని నూతన యూజీడీ పనులకు రూ.4 కోట్ల నిధులను, ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా మరో రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎండీకి విన్నవించినట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



వేడుకలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

మన్సూరాబాద్: అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజ్స్ ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల ఫ్రెషర్స్ డే వేడుకలు మిలాప్ 2కె25 పేరుతో శనివారం మన్సూరాబాద్‌లోని ఎస్కే గార్డెన్స్‌లో ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజ్స్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావుతో పాటు జేఎన్‌టీయూ ఐటీ హెడ్ ప్రొఫెసర్ శాంతిశ్రీ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ..అవంతి విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏలతో పాటు ఫార్మసీ కోర్సులన్నాయని, త్వరలోనే యూనివర్సిటీగా ఆవిర్భవించబోతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెంటర్‌మీ కేరీయర్ ఇంటెలిజెన్సీ ట్రెనింగ్ ప్రైవేటు లిమిటెడ్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ కిరణ్ ఆగస్త్యా, ఏపీసీ టీ హబ్ మేనేజర్ డాక్టర్ గౌరవ్‌గుప్తా, అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాళ్లు డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ అజ్మల్‌హుస్సేన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

క్రషర్ మిక్సర్ వాహనం బోల్తా

డ్రైవర్ మృతి, క్లీనర్‌కు గాయాలు



నాగోలు: క్రషర్ మిక్సర్ వాహనం బోల్తా పడి డ్రైవర్ మృతి చెందగా..క్లీనర్ గాయపడిన ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివ చరణ్(25) హయత్‌నగర్ శివారులోని సద్దుపల్లి వద్ద ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతాన్ని చెందిన మున్నాలాల్ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం తారామతిపేట నుంచి క్రషర్ మిక్సర్ వాహనం లోడ్‌తో మర్రిపల్లిలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు కోసం వెళ్తుండగా తట్టి అన్నారం వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శివ చరణ్ అక్కడిక్కడే మృతి చెందగా, క్లీనర్ మున్నాలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు మున్నాలాల్‌కు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం



నాగోలు: ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నిబంధనలను పాటిస్తూ అప్రమత్తతో వాహనాలను నడిపినప్పుడే ప్రమాదాలు జరగవని నాగోలు ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్నాథ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా శనివారం బండ్లగూడ ఆర్టీసీ డిపోలో దీర్ఘకాలికంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా విధులు నిర్వహించిన ముగ్గురు డ్రైవర్లను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అమర్నాథ్ మాట్లాడుతూ..రోడ్డు భద్రత ప్రతీ పౌరుడి బాధ్యత అన్నారు. అనంతరం నాగోలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం జగన్, బండ్లగూడ డీఎం వెంకటేశం, అసిస్టెంట్ మేనేజర్ శాలిని, మెకానికల్ ఇంజినీర్ బాలయోగేశ్వరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న సినీ హీరో కార్తికేయ

ఎల్‌బీనగర్: భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని సినీ హీరో కార్తికేయ అన్నారు. సాగర్ రోడ్డు హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్ 30వ వార్షికోత్సవాన్ని బీఎన్‌రెడ్డి నగర్‌లోని బీడీరెడ్డి గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్తికేయ మాట్లాడుతూ..టాలెంట్ ప్రతి ఒక్కరిలో ఉంటుందని కానీ ఎవరైతే క్రమశిక్షణ, నిబద్ధతతో కృషి చేస్తారో వారు మాత్రమే ఆయ రంగాల్లో విజయం సాధిస్తారన్నారు. నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్ పర్సన్ రజినీ విఠల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ రాజశేఖర్, సీఏఓ శేషారావు, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వనస్థలిపురం: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ లేనందున విశ్రాంత ఉద్యోగులు అందరికీ ఆసరా పెన్షన్, తెల్ల రేషన్‌కార్డు ఇప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల భార్యా భర్తలకు సూపర్ లగ్జరి బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించాలని, వారి సంఘ భవనానికి హైదరాబాద్‌లో స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న ఉదయం 10 గంటలకు హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్‌లో రాష్ట్ర 11వ మహాసభను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సభకు అన్ని జిల్లాల నుంచి విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. సంఘం అధ్యక్షుడు రహమాన్ సోఫి, ప్రధాన కార్యదర్శి బి.వి.కోటయ్య, రాష్ట్ర నాయకులు ఎస్.బుచ్చిరెడ్డి, కే.సత్యం, యాదగిరి, వీరస్వామి పాల్గొన్నారు.

నేడు అల్కాపురిలో ధర్మ వ్యాప్తి సదస్సు

దిల్‌సుఖ్‌నగర్: కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారక సేవా సంస్థ (కేసీడీటీ) ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం అలకాపురి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం దేశవ్యాప్తంగా ఉన్న 200 కు పైగా స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలతో సదస్సు నిర్వహించనున్నట్లు కల్వకొలను శ్రీరామ చంద్రమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వమానవ ఏకత్వాన్ని ప్రతిబింబించడంతో పాటు, సనాతన ధర్మ ప్రచారం, సేవా భావాన్ని సమాజంలో చొప్పించడంలో సదస్సు కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9494877070 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అన్ని శాస్త్రాలకు వేదాలే మూలం



వేద పరీక్షల్లో విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: అన్ని శాస్త్రాలకు వేదాలే మూలం అని, వేద సంరక్షణతో ధర్మబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వేదశాస్త్ర సంవర్ధిని సభ అధ్యక్షుడు కోటం రాజు సీతారామ శర్మ ఘనాపాఠి అన్నారు. శనివారం ఎల్‌బీనగర్‌లోని గోటేటి కళ్యాణ మండపంలో వేద శాస్త్ర సంవర్ధిని సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ వార్షిక వేద సంస్కృత సాహిత్య పరీక్షలు ప్రారంభించారు. అనంతరం సీతారామ శర్మ మాట్లాడుతూ..వేదభూమి అయిన భారతదేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఉపయోగపడేలా వేద విజ్ఞానంపై పరిశోధనలు జరగాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది ఔత్సాహికులు వేదాలు నేర్చుకుంటున్నారని, వేద పాఠశాలల విద్యార్థుల ఆసక్తి నిజంగా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాండితులు పాల్గొన్నారు.